వెళ్తూ చెంబుతో నీళ్లు పట్టిగెళ్లడం మర్చిపోయేట్ట. నేను కంపు అన్నానని నామీద కోప్పడి వెళ్లాడు. ఎవరి కంపు వారి కింపు కదా!'' అని చెప్పి నేను కూడా ఇవతలికి వచ్చేశాను.

★★★

ఇలాగ -

జేబులో పెన్ పెట్టుకోకపోయినా ఏదైనా రాసేడానికి సిద్ధపడిపోయే వాళ్లూ, డబ్బు పారేస్తే కొండమీది కోతినైనా కొనెయ్యొచ్చన్న ధీమాతో వేలకి వేల కిలోమీటర్ల ప్రయాణాల్లో కూడా గుక్కెడు నీళ్లూ రూపాయి చిల్లరా తెచ్చుకోని వాళ్లూ -

పది రూపాయలిచ్చి కింగుసైజు ఫిల్టరు సిగరెట్టు పెట్టె కొనీకూడా పావలా పెట్టి అగ్గిపెట్టి కొనడం మర్చిపోయేవాళ్లూ......

ఊళ్లో ఉన్నా కేంపుల్లో ఉన్నా నాకు కనబడుతూనే ఉన్నారు.

మీకూ కనబడుతూనే ఉన్నారా?

అయితే ఇది మరచిపోయే కథే.

★

# 47. శబ్దా భక్తులు

"సార్ ఉన్నారూ, అమ్మా?" అని అడిగిన మనిషికి మా ఆవిడ "ఆ; ఉన్నారు. ఎవర్నువ్వు?" అని సమాధానం చెప్పి ప్రశ్న వెయ్యడంతో నేను రాసుకుంటున్నది ఆపి, లేచి వీధి గుమ్మం దగ్గరికొచ్చేను. అక్కడ దీనంగా నిలబడి ఉన్నవాడు "మదార్‌సాహెబు". రెండేళ్ల కిందట అనంతరామయ్య ఆఫీసులో పనిచేస్తూ ఉండేవాడు.

"సలాం ఆలేకుంసార్" అన్నాడు నన్ను చూడగానే మొహంలోకి కాంతి తెచ్చుకుని .

అతను మాట్లాడినది యధాతథంగా చెప్పలేను గాని సారాంశం మాత్రం ఇది:- మా ఇంటికి అర ఫర్లాంగ్ దూరంలో కొత్తగా వెలసిన "టెంపుల్ కాంప్లెక్స్" (దేవాలయ సముదాయం) లో ఆ రోజునుంచి మొదలెట్టి తొమ్మిది రోజులపాటు పూజలు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. వాటికి తాను తెచ్చిన మైక్ మరియు లౌడ్ స్పీకర్లు ఉపయోగిస్తున్నారు. ఆ రాత్రి, (మరియు తరువాత రాబోయే ఎనిమిది రాత్రులు) పదకొండు గంటలు దాటాక ఆ సరంజామా అంతా మా ఇంట్లో జాగర్త పెట్టి మళ్లా తెల్లవారుజామున నాలుగున్నరకి పట్టుకుపోనివ్వాలి. దేవాలయ సముదాయంలో ఆ ఖరీదైన మైక్‌సెట్లు లవుడు స్పీకర్లు జాగర్త పెట్టడానికి ఏర్పాటు లేదుట. పోనీ ఇంటికి పట్టుకుపోయి తెల్లారుజామున తీసుకురావాలంటే బోలెడు దూరం మూలాన్నించి రిక్షా కర్చులు తడిపిమోపెడు అవుతాయట. తెలిసిన వాళ్లెవరయినా దొరుకుతారా అని వెదుకుతూ వుంటే నా పేరుగల సైన్‌బోర్డు మా ఇంటి కాంపౌండ్ గోడకి కొట్టి వుందిట.

"ఐతే - ఉదయం నుంచి చెవులు ఘుల్లడిపోయేటట్టు సౌండ్ పెట్టి న్యూసెన్సు చేస్తున్నది నువ్వా నాయనా!" అంటూ మా ఆవిడ, "మా ఇంట్లో భోజనం యంతమాత్రం వీలు పడదు" అన్న అగ్నిహోత్రావధానుల్లా మొహం పెట్టి ఇంట్లో కెళ్లిపోయింది.

"మాదీ తప్పు ఏమీ వుంది సార్? కిరాయ్‌కి మైకూ పెట్తామ్. సౌండు పెంచూ, సౌండు పెంచూ బోల్‌కే ఆర్గనైజర్స్ జులుమ్ సే హుకుమ్ జారీ చేస్తార్; ఏమీ చెయ్యాలే?" అన్నాడు మదార్ సాహెబు.

ఓవర్ హెడ్ టాంకు నింపడానికి పెట్టించిన మోటారు కోసం కట్టిన (చిన్న టేబిల్ అంత) గది చూపించాను. "ఇందులో పడ్తాయా ఆ సామాన్లన్నీ?" అన్నాను. "ఏమ్టిసార్, ఇంత పెద్ద హవేలీ వుందీ, ఇక్కడనా ఇచ్చేది?" అంటూ ప్రతిఘటించాడు గాని; ఆ చిన్న గదికి తాళం ఏర్పాటు ఉందని, రాత్రి మేం నిద్రపోయాక ఆ సామాను అక్కడుంచడం, తెల్లరుజామున మేం లేవకముందు అవి పట్టుకుపోవడం అక్కడైతేనే మాకు నిద్రా భంగం కాకుండా చెయ్యగలుగుతాడని నచ్చజెప్పేసరికి ఒప్పుకున్నాడు.

ఆ తరువాత అతను ఎప్పుడొస్తున్నాడో ఎప్పుడు వెళ్తున్నాడో తెలియకపోయినా ఆ మైక్‌సెట్టు ధ్వనులు మా చెవులు బద్దలుకొడుతూ ఉన్నందువల్ల మదార్ సాహెబు రోజూ వస్తున్నాడని మాత్రం తెలిసింది. ఆ నాలుగోరోజు ఆదివారం పడినందువల్ల నేను పగలు ఇంటి దగ్గరే ఉన్నాను. కాని, ఏదీ రాసుకోడానికి గాని చదువుకోడానికి గాని వీల్లేకుండా వుంది ఆ శబ్దం వల్ల. పూజ గదిలోకి వెళ్లి నాలుగు దూది వొత్తులు సంపాదించి ఒక్కొక్క చెవిలో రెండేసి చొప్పున దోపుకుంటూ వుండగా మా ఆవిడకి దొరికిపోయాను.

"కాలక్షేపానికి చదువుకోడానికే మీకింత డిస్టర్‌బెన్సుగా వుందే; ఈ వీధి వీథంతా వున్న కుర్రాళ్ళకి ఎలా వుండాలి? పరీక్షలకి చదువుకొనేవాళ్లూ, హోం వర్కులు చేసుకునే వాళ్లూ ఉంటారే! వాళ్ల మాటేమిటి అని అడుగుతున్నాను!" అని గట్టిగా అరిచింది.

"అరవకు, నాకేం చెముడు లేదు." అని నేనూ అరిచాను.

"ఇప్పుడు లేని మాట నిజమే కాని ఇదే లెక్కని ఇంకో ఆరునెలలిక్కడుంటే చెముడువొచ్చి తీరుతుంది!"

ఉండక ఎక్కడికి పోవాలి? పుట్టినన్నాళ్లకి పురుషుడు యజ్ఞం చేసేడన్నట్టుగా చచ్చీ చెడీ ముప్పయ్యేళ్లు పైసాపైసా పోగేసి అక్కడ ఇల్లు కట్టుకున్నాం. గుడి కాంప్లెక్స్ కట్టించడానికి ఒక కమిటీ ఏర్పడ్డం, చందాలు వసూలు చెయ్యడం, స్థలం విరాళం పొందడం, దుర్గ, లక్ష్మి, ఈశ్వరుడు, రాముడు, హనుమంతుడు, విఘ్నేశ్వరుడు, షిర్డీ సాయిబాబా, రాఘవేంద్ర స్వామి, అయ్యప్ప స్వామి అందరూ అందినంత దూరంలో తలా ఒక గుడీ కట్టించుకోవడం అంతా మూడు నెలల్లో పూర్తయింది.

"ఉదయమో సాయంకాలమో, మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడో; మనసుకి ప్రశాంతత కావాలనిపించినప్పుడో- గుడికి వెళ్లొచ్చు, కాసేపు కూర్చోవచ్చు, అంతేగాని ఈ చప్పుడంతా పెట్టమని ఏ దేవుడు చెప్పేడు?" అంది మా ఆవిడ.

నూట పదహార్లు విరాళం యిచ్చి దైవకార్యాన్ని ప్రోత్సహించి ఉన్నందువల్ల నేనేమీ అనలేదు.

"పోనీ, ఆ లవుడు స్పీకర్లలో వినిపించే పాటలైనా రామా కృష్ణా కాదు, శివా శంకరా కాదు సరికొత్త సినిమాల్లో వొస్తున్న లేటెస్టు బూతుల(వ్వ) పాటలు! వ్వ వ్వ! ఈ ఏడాది ఈ పేటలో ఒక్క పిల్లాడు గాని, ఒక్క పిల్లగానీ పరీక్షలు పాసయితే అదొక వింత అయి తీరుతుంది!"

పోనీ, అలా గుడి కాంప్లెక్స్ వరకూ వెళ్లి మదార్ సాహెబ్‌తో లాలూచీ పడి సౌండు తగ్గించమని చెప్పి వద్దామా అని బలహీన పడ్డాను.

"మొన్న నేమిటి చేసేరు, తెలుసా? గాంధీపురంలో ఎవరో వాళ్లమ్మాయి పెళ్లి దేవుడు సమక్షంలో చేస్తామని మొక్కుకున్నారట. సర్వదేవ నమస్కారం ఇక్కడ సాధ్యపడుతోంది కదా అని మీ కమిటీని అడిగితే కొంచెం అద్దె కట్టించుకొని పర్మిషన్ ఇచ్చేరుట. ఆ రోజు మీ మదారు సాహెబు మైక్ సెట్టు తెల్లవార్లూ పనిచేసింది. ఆ పురోహితుడు మంత్రాల దగ్గర్నుంచీ దక్షిణల దగ్గర్నుంచీ చదివింపుల దాకా అన్నీ మైకులోనే వల్లించాడు. గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులు, కార్తీక మాసం, అయ్యప్ప స్వామి సీజను, సంకురాత్రి, శివరాత్రి, శ్రీరామ నవరాత్రులు-ఇలా ఏడాది పొడుగునా మనకి దైవభక్తి ప్రదర్శించుకొనే అవకాశాలు కలకాలం భరించాల్సిందే."

మదార్‌సాహెబ్ మైక్‌సెట్ లోంచి వస్తున్న సౌండు కన్నా పెద్ద శృతిలో మా ఆవిడ ఇలా తగులుకొనే సరికి నాకు చిర్రెత్తుకొచ్చింది. "ఛీఛీ, ఏమిటి నీ వాగుడు? అసలే హిందూమతం దేశంలో మైనారిటీ అయిపోయి అందరూ అణగ దొక్కేస్తువున్న ఈ రోజుల్లో - భక్తీ, నోములు, వ్రతాలు. పూజలూ, ఆచరించే సంప్రదాయాన్ని మనసా వాచా కర్మణా కాపాడవలసిన పట్టుగొమ్మలు స్త్రీలే అన్న సంగతి మరచిపోయి ఏమిటీ నీ వితండ వాదం? కళ్లు పోతాయి జాగర్త! నువ్వు చేస్తున్నది దైవ దూషణ అనేదే మరచిపోతున్నావు!" అని దబాయించాను.

"చాల్లెండి నిర్వాకం, మీకేమైనా కామన్‌సెన్స్ అన్నది ఉంటే చెవుల్లో దూది కుక్కేసుకుని ఇంట్లో కూచోకుండా వెంటనే వెళ్లి మీ కమిటీ వాళ్లతో చెప్పి ఆ సౌండు తగ్గించే ప్రయత్నం చేయండి. భక్తి "తప్పు" అని నేనే కాదు ఎవ్వరూ అనరు. భక్తికి కావలసింది ప్రశాంతత, నిశ్శబ్దం అని వాళ్లకి నచ్చచెప్పండి. శబ్దం వల్ల పబ్లిసిటీ వస్తుంది కాని, ఆదిశంకరులు వేద వ్యాసులూ చెప్పిన ఏకాగ్రత సిద్ధించదని తెలుసుకోమనండి."

నాకో చిన్న ఉపాయం తట్టింది. ఈ మదార్ సాహెబ్ ఆ మధ్య పెళ్లి చేసుకున్నప్పుడు వాళ్ల మామగారు ఇతనికి ఒక మైకుసెట్టు రికార్డులు కేసెట్టు సరంజామా అంతా ఇచ్చాడు. ఉద్యోగం చేసుకుంటూ దీని మీద అద్దెలు తెచ్చుకొని నా కూతురూ నువ్వూ సుఖంగా ఉండండి అని దీవించేడు. రాజకీయ సభల నుంచి దైవపూజల వరకు శబ్దమయ ప్రపంచంగా విలసిల్లుతున్న సమాజం "ఉద్యోగం మిధ్య, శబ్దమే శాశ్వతం" అని అతనికి నచ్చచెప్పి ఇదే వ్యావృత్తిలో దింపింది. అంచేత రేట్లు పెంచవయ్యా అని అతనికి "కీ" ఇస్తే ఆ రేట్లు చెల్లించుకోలేక కమిటీ వారు ఇతన్ని మానిపించే అవకాశం ఉందేమో అని మదార్ సాహెబును వెతుక్కుంటూ దేవాలయ సముదాయానికి బయలు దేరాను. నేను వెళ్లేసరికి మా దేవాలయ సముదాయ కమిటీ సెక్రటరీ గారు మైకు చేత్తో పుచ్చుకొని మాట్లాడుతున్నాడు. "భక్తులకు ఒక శుభవార్త. ఈ మధ్య మన దేవాలయ సముదాయానికి వచ్చిన ఆదాయం చాలా ప్రోత్సాహకరంగా ఉండడంచేతనూ. ఇప్పుడే ఒక భక్తుడు అనగా శ్రీ..... గారు మన దేవాలయ సముదాయం ఒక స్వంత మైకుసెట్టు అమర్చు కొనే నిమిత్తం వెయ్యిన్నూటపదహార్లు తమ విరాళంగా ప్రకటించడం చేతనూ, రేపే ఈ సూచన అమలుచేస్తూ పెర్మనెంటు మైకుసెట్టు లవుడు స్పీకర్లు ఏర్పాటు చేస్తున్నాము!" ★